## సీడీఎంఏను కలిసిన మున్సిపల్ కమిషనర్

బెల్లంపల్లి, జనవరి 23: డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) దివ్య దేవరాజన్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఏడీఎంఏ) జాన్ శ్యాంసన్‌ను బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ భుజంగరావు మంగళవారం కలిశారు. హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. బెల్లంపల్లిలో అభివృద్ధి పనులను వారికి వివరించారు.



సీడీఎంఏ దివ్య దేవరాజన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ భుజంగరావు ➤

## రిపబ్లిక్ డే పరేడ్‌కు గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 23 : ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్‌లో పాల్గొనేందుకు జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడా పాఠశాల విద్యార్థులు ఆత్రం అంజలి, తుంరం సత్యభామ కు ఆహ్వానం అందినట్లు జిల్లా గిరిజ న క్రీడల అధికారి బండ మీనా రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు తెలిపారు. క్రీడల్లో అత్యంత ప్రతిభ చూపినందుకు వీరికి ఆహ్వానం అందినట్లు పేర్కొనానరు. కాగా, ఈ విద్యార్థులను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కుష్బూ గుప్తా, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, కమర్ హుస్సేన్, పురుషోత్తం, జీసీడీవో శకుంతల, క్రీడా పాఠశాల శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ అభినందించారు.



ఆత్రం అంజలి



తుంరం సత్యభామ



జంగుబాయి వద్ద పూజలు చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

## జంగుబాయిని దర్శించుకోవడం అదృష్టం

- రాష్ట్ర మంత్రి సీతక్క
- ప్రకృతిని పరిరక్షించాలని గిరిజనులకు సూచన



మంత్రికి నమస్కరిస్తున్న ఆదివాసీ మహిళ

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ) /కెరమెరి, జనవరి 23: జంగుబాయి అమ్మవారిని దర్శించుకోవడం తన అదృష్టమని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. సహ్యాద్రి పర్వతంలోని గుహలో కొలువైన జంగుబాయి దేవతను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ జొజ్జు, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకృతి దేవుడు ప్రసాదించిన వరమని, వాటితో పాటు సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్య త ఆదివాసీలపైనే ఉందని తెలిపారు. జంగుబాయితో పాటు కెస్లాపూర్‌లోని నాగోబా జాతరల నిర్వహణకు కావాల్సిన నిధులను విడుదల చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. జాతర ప్రాంతంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీనిచ్చారు. నాగోబా జాతరకు రూ.20 లక్షలు, ఇంద్రవెల్లిలో రూ. 90 లక్షలతో స్మృతివనం నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు చేశామని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇన్‌చార్జిగా అవకాశం రావడం దేవుడు కల్పించిన వరమని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. ఆదివాసీల సంస్కృతి చాలా గొప్పదని, వాటిని రాబోయే తరాలకు అందించేలా కృషి చేయాలని కోరారు. జంగుబాయి వేడుకల నిర్వహణకు రూ. 10 లక్షల మంజూరుకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఎంపీపీ పెందోర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మాకి దుర్పతాబాయి, ఎంపీడీవో మహేందర్, తహసీల్దార్ మున్నావార్ షరీఫ్, స్థానిక సర్పంచ్ లింబాదాస్, దేవాలయ కమిటీ చైర్మన్ కొడప జాకు, సభ్యులు మరప బాజీరావ్, నాయకులు, పాల్గొన్నారు. వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ విజయ్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# అడవి ఒడిలో ఆరాధ్య దైవం

### సహ్యాద్రి పర్వతాల్లో కొలువైన శార్ధూల వాహిని

- ఆదివాసీ బిడ్డల పుణ్యస్థలం జంగుబాయి క్షేత్రం
- 25న మహాపూజ..నెల రోజులపాటు జాతర
- పూజలకు తరలిరానున్న గిరిజనం



నైవేద్యానికి దినుసులను సేకరిస్తున్న ఆదివాసీలు



జంగుబాయి గుహలో ఉన్న పోచమ్మ దేవుళ్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/కెరమెరి, జనవరి 23 : ప్రకృతినే దైవంగా కొలిచే ఆదివాసీలు వారి ఆచారాలు సంస్కృతీ సంప్రదాయాలను కొండకోనల్లోనే నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. సహ్యాద్రి పర్వతాల్లోని తెలంగాణ– మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న గుహల్లో శార్ధూల వాహిని జంగుబాయి కొలువై ఉంది. తెలంగాణతో పాటు ఏపీ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల నుంచి గోండు, పర్ధాన్, కొలాం తెగలకు చెందిన ఆదివాసీలు యేటా పుష్యమాసంలో ఇక్కడికి వేలాదిగా తరలివస్తారు. గురువారం(ఈనెల 25న) నుంచి జరిగే పూజలతో ఇక్కడ వేడుకలు ప్రారంభం కానుండగా, నెల రోజుల పాటు కొనసాగనున్నాయి.

### ఆదివాసీల ఆరాధ్యదైవంగా..

ఆరాధ్యదైవం జంగుబాయిని నియమనిష్ఠలతో కొలిస్తే అంత శుభమే చేస్తుందని గిరిజనుల నమ్మకం. కెరమెరి మండల కేంద్రానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరందోలి పంచాయతీ మహరాజ్‌గూడ అటవీ ప్రాంతంలోని గుహల్లో జంగుబాయి కొలువై ఉంది. కొండకు ఆనుకొని ప్రవహిస్తున్న వాగులో భక్తులు పుణ్యస్నానాలు చేసి జంగుబాయికి మొక్కులు తీర్చుకుంటారు. ఏడాదికి ఒకసారి జరిగే జాతర సమయంలో నిత్యం వేలాది మంది తరలివస్తారు.

### పుష్యమాసం ఎంతో పవిత్రం

ఆదివాసీలకు పుష్యమాసం ఎంతో పవిత్రమైంది. ఈ మాసంలోనే గిరిజనులంతా తమ ఆరాధ్య దేవుళ్లను నిష్ఠతో కొలుస్తారు. పుష్యమాసం నెలవంక కనిపించిన రోజు నుంచి అమావాస్య వరకు పవిత్రమైన రోజులుగా భావిస్తారు. పాదరక్షలు ధరించరు. మద్యపానానికి దూరంగా ఉంటారు. నేలపైనే నిద్రిస్తారు. అత్యంత నిష్ఠతో పూజలు కొనసాగిస్తారు.

### ప్రత్యేక పూజా విధానం..

ఆదివాసీలు తమ దేవుళ్లకు పూజలు చేసేందుకు ఇతర కులాల వారికి అనుమతినివ్వరు. వారిలోనే కొంత మంది పూజాలుగా వ్యవహరిస్తారు. తమ పంటలతోనే దేవుళ్లకు నైవేద్యాన్ని సమర్పిస్తారు. వడ్లను ఇంటి వద్దనే రోళ్లలో దంచి సేకరించిన బియ్యాన్ని పూజలో వాడుకుంటారు. నైవేద్యం కోసం గోధుమ పిండి, పప్పు, బెల్లం అవసరం. పురాతన పద్ధతుల్లో తీసిన నువ్వుల నూనెనే వాడతారు. దీపారాధన కోసం నెయ్యి లేదా నువ్వుల నూనే, ఆముదం నూనెను మాత్రమే వాడుతారు. పూజా సామగ్రితో కాలినడకన జంగుబాయి వద్దకు చేరుకుంటారు. రాత్రిపూట దీపారాధన చేసి ప్రత్యేక నైవేద్యం సమర్పిస్తారు. పుణ్యక్షేత్రం వద్ద తుమ్రం, కొడప, సలాం, రాయిసిడాం, వెట్టి, మరప, హెర్రెకుమ్ర, మందాడి (8) గోత్రాల కటోడాలు(పూజారులు) పూజలు చేస్తారు. డోలు, సన్నాయి వాయిద్యాల మధ్య దీపారాధన చేస్తారు. అక్కడి నుంచి మైసమ్మ, పోచమ్మ, రావుడ్క్ వద్ద మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం సహపంక్తి భోజనం చేసి దేవుడి పాటలు పాడుతూ అమ్మవారిని ఆరాధిస్తారు. మరుసటి ఉదయం సంప్రదాయ వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ సంబురాలు చేసుకుంటారు. ఇలా నెల రోజుల పాటు ఇలాగే పూజలు కొనసాగుతాయి.



గుహవద్దకు నైవేద్యాలతో వస్తున్న ఆదివాసీ మహిళలు





వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న ఎస్పీ సురేష్ కుమార్

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోండి

### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీజీపీ రవిగుప్తా ఆదేశం





వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న డీజీపీ రవి గుప్తా

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 23: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీజీపీ రవిగుప్తా ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎస్పీలతో 2023లో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ సురేశ్‌కుమార్ జిల్లా పోలీసు అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తరుచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ సురేశ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 2023 సంవత్సరంలో 135 రోడ్డు ప్రమాదాలు జరిగాయని వివరించారు. ప్రమాదాలకు గల కారణాలను ఆరా తీస్తూ, ప్రమాద స్పాట్‌లను గుర్తించి వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ అచ్చేశ్వరరావు, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, డీసీఆర్బీ డీఎస్పీ రమేశ్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణా ప్రతాప్, డీసీఆర్బీ సీఐ రమేశ్ తదితరులున్నారు.

# చదవనిద్దాం..ఎదగనిద్దాం..

- ఆడపిల్లలను కాపాడుకుందాం..
- నేడు జాతీయ బాలికా దినోత్సవం

కోటపల్లి, జనవరి 23: ఆడపిల్లల సాధికారతకు విద్య మూలస్తంభం. చదువుతోనే బాలికల ఉన్నతికి మార్గం సాధ్యమవుతుంది. ఆడ పిల్లల శ్రేయస్సు, వారి విద్య పట్ల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. బాలికల విద్య కోసం కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, గురుకులాలు, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేసి వారికి విద్యకు, బంగారు భవితకు బాటలు వేసింది. ఆడపిల్లల పట్ల వేధింపులకు పాల్పడిన వారిని, వివక్షకు గురి చేసేవారిని గుర్తించి వారికి కఠిన శిక్షలు అమలు పరిచి బాలికా శ్రేయస్సుకు కృషి చేసింది. మొట్టమొదటగా 2008లో జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించారు. దేశంలో ఆడపిల్లల పట్ల వివక్షపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ బాలికా దినోత్సవాన్ని ప్రారంభించారు.



బాలికల విద్య ప్రాముఖ్యతను తెలుపుతూ కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వేసిన ముగ్గు

### విద్య ద్వారా సాధికారత

బాలికా సాధికారత విద్య ద్వారానే సాధ్యమవుతుంది. ఆడ పిల్లలు చదువుకున్నప్పుడే కుటుంబం బాగుపడుతుంది. అందుకే బాలికల చదువుకు ప్రభుత్వాలు ప్రథమ ప్రాముఖ్యతను కల్పించాయి. బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆడ పిల్లలు నేడు అన్ని రంగాల్లో రాణించి విజయాలు సాధిస్తూ ముందుకెళ్తున్నారు. జిల్లా పోలీస్ శాఖ కూడా బాలికల్లో భరోసా నింపేందుకు వివిధ కార్యక్రమాలను చేపడుతున్నది. షీ టీం ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

### విద్యనే భరోసా



బాలికలకు విద్యనందించడమే భరోసాను కల్పిస్తుంది. ఆడపిల్లలు విద్యనభ్యసిస్తేనే ఆ కుటుంబం బాగు పడుతుంది. స్థానికంగా ఉన్న అవకాశాలును అందిపుచ్చుకొని ముందుకు సాగాలి. బాలికా విద్య కోసం ప్రభుత్వాలు చేస్తున్న కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ముందుకెళ్లాలి.

*-హరిత కేజీబీవీ, ఎస్వో కోటపల్లి*

## ఉచ్చుకు తగిలి ఊపిరి వదిలి..

### కెరమెరి మండలంలో ఘటన

కెరమెరి, జనవరి 23: మండలంలోని కొలాంగూడ(ధనోర) గ్రామానికి చెందిన సిడాం భీము(45) వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చుకు తగిలి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మురికిలొంక గ్రామానికి చెందిన భీము కోసం సోమవారం రాత్రి కట్టి అనే వ్యక్తి వచ్చాడు. ఆ సమయంలో ఇంట్లో లేకపోవడంతో భీము భార్యకు తాను వేటకు వెళ్తున్నానని వచ్చాక చెప్పమని సీము చెప్పి వెళ్లాడు. ఆ తర్వాత కాసేపటికి ఇంటికి వచ్చిన భీముకు భార్య విషయం తెలిపింది. దీంతో తాను కూడా వెళ్తానని భీము ఇంటి నుంచి బయలుదేరాడు. అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు అమర్చిన విద్యుత్ తీగ తగిలి భీము మృతి చెందాడు. అయితే భీము రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో భార్య భీంబాయి స్థానికుల సహాయంతో మంగళవారం అటవీ ప్రాంతానికి వెళ్లింది. అక్కడ భీము మృతదేహం కనిపించింది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో బీంబాయి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ తెలిపారు.

# అభివృద్ధే మంత్రం కావాలి

- ప్రజలకు సంక్షేమ ఫలాలు చేరాలి
- రాష్ట్ర మంత్రి సీతక్క ఆదేశం
- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అటవీ అధికారులతో సమీక్ష
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, అధికారులు





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఉట్నూర్, జనవరి 23: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు అధికారులు అభివృద్ధే మంత్రంగా పనిచేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. స్థానిక కుమ్రం భీం కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో విద్య, వైద్యం, రవాణ, నీటిసరఫరా, విద్యుత్ వంటి సౌకర్యాల కల్పనకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందిచే దిశగా ప్రభుత్వ పథకాలు అమలు కావాలని సూచించారు. కుమ్రం భీం, హైమన్ డార్ఫ్, బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాల వారీగా సాగుతున్న పనులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, గడ్డం వినోద్, కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్, వెడ్మ బొజ్జు, నాలుగు జిల్లాల కలెక్టర్లు రాహుల్ రాజ్, బదావత్ సంతోష్, హేమంత్ బోర్కడే, రాహుల్, దీపక్ తివారీ, ఫైజల్ అహ్మద్, ఉమ్మడి జిల్లా అటవీ అధికారులు ప్రశాంత్ బాజీరావు పాటిల్, శివ్ ఆశిష్, నీరజ్, రాంకిషన్, తదితరులున్నారు.



పాల్గొన్న ఉమ్మడి జిల్లా అధికారులు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, అటవీ శాఖ అధికారులు

## పులుల రక్షణ అందరి బాధ్యత

### సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్, జనవరి 23: అడవుల్లో పులులు, వన్య ప్రాణుల రక్షణ అందరి బాధ్యత అని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన నష్ట పరిహార చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులులకు క్రిమిసంహారక మందులు, విద్యుత్తీగలు అమర్చి అంతమొందించడం సరికాదన్నారు. పులి దాడిలో పలు పశువుల మృతి చెందగా, సంబంధిత యజమానులకు చెక్కులను అందించారు. జడ్పీ చైర్మన్ కోనేరు క్రిష్ణరావు, డీఎఫ్‌వో నీరజ్ కుమార్, ఎఫ్ఆర్వో రమాదేవి, రూరల్ సీఐ నాగరాజు, ఎస్ఐ సోనియా, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న రాజేశ్వర్ రావ్

## 'అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి'కి జాతీయ పురస్కారం

దండేపల్లి జనవరి 23 : లక్షెట్టిపేట పట్టణానికి చెందిన ప్రముఖ కవి, సాహితీ స్రవంతి లక్షెట్టిపేట కోశాధికారి లేదాళ్ల రాజేశ్వరరావు రచించిన అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి అనే కవితా సంపుటి గిడుగు రామమూర్తి స్మారక సాహిత్య పురస్కారం 2023కి ఎంపికైంది. ఈ నెల 22న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ వారు నిర్వహించిన గిడుగు వర్ధంతి వేడుకల్లో భాగంగా ఈ పురస్కారాన్ని తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా రాజేశ్వరరావుకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు కళారత్న బిక్కి కృష్ణ, ఫౌండేషన్ అధ్యక్షురాలు శ్రీమతి గిడుగు కాంతికృష్ణ, ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం, జీవన్ లాల్ లవాడియా, జల్ది విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ పురస్కారం అందుకున్న రాజేశ్వరరావును సాహితీ స్రవంతి అధ్యక్ష కార్యదర్శులు శ్రీమతి ల్యాదాల గాయత్రి, నూటెంకి రవీంద్ర, కవులు గోపగాని రవీందర్, వేనంక చక్రవర్తి, కందుల తిరుపతి, రాచకొండ శ్రీనివాస్, ముత్యం మల్లేశం, లేదాళ్ల జయ, భారతి, సుబ్బాయమ్మ, కొట్టె వినయ్ కుమార్, సందీప్, సంతోష్, వినోద్ తదితరులు అభినందించారు.